క్లుప్తంగా

ఆటపాటలతో ఆరోగ్యం



మచిలీపట్నంటౌన్: చిన్నారులు పలురకాల ఆటలను ఆడటం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎంవీడీటీ నగేష్ అన్నారు. స్థానిక పోర్టురోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత 17 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. చేతిరాత మెరుగుదల ఎలా చేసుకోవాలో ఉపాధ్యాయుడు ఎ.అప్పినీడు వివరించారు. స్పోకెన్ ఇంగ్లిషు నేర్పించారు. జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ నిర్వహించారు. విద్యార్థుల్లోని ప్రతిభను పెంచారు. ఈ సందర్భంగా చిన్నారులు మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్, చెస్ తదితర ఆటలు ఆడారు. ఈ కార్యక్రమాన్ని లైబ్రేరియన్ శిరీష పర్యవేక్షించారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



పెడన: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఈ విద్యార్థులకే రెండో పూట మరొక పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించగా 85 మందికి గాను 84 హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ: స్థానిక కోడూరు రోడ్డులో ఉన్న పాత సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లపై వాలిన చెట్లను తొలగించే పనుల కారణంగా సోమవారం పలు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. రామకోటిపురం, రామచంద్రపురం, వలందపాలెం, మాచవరం, మేడిలంక, అయ్యవారిపాలెం, ఒడుగువారిపాలెం, దక్షిణ చిరువోలులంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాని నిలిపివేస్తామన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



గుడివాడటౌన్: గుడివాడలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రగతి గార్డెన్స్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 45 మంది బాధితులకు వైద్యసేవలందించారు. గుండె, నరాల వైద్య విభాగానికి చెందిన ప్రముఖ వైద్యులు దేవి శ్రీరామ్, అభిషేక్, తరుణ్ కుమార్‌రెడ్డిలు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు టి.ఎస్.రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు సూర్యచంద్రరావు, బి.శంకరరావు, ఎం.రమణమూర్తి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు అజయ్, శోభారాణి బృందం పరీక్షలు చేశారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 42 మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయని ఆరుగురికి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. ఉచిత ఆపరేషన్‌లను వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేసిందని, కళ్లజోళ్లు రూ.300 అందజేస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శి డి.శ్రీనివాస్, కోశాధికారి టి.రామ్మోహన్, ఎల్ఈ వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య, కుటుంబరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. మండలంలోని పునాదిపాడు జెడ్పీ హైస్కూల్‌లో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమావేశం స్థానిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. వారు విద్యనభ్యసించిన తరగతి గదులకు వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వారధిపై నీలినీడలు



ఉల్లిపాలెం- భవానీపురం వారధి



రాళ్ల కట్టడాల మధ్యలో పెరిగిన చెట్లు

- వారధికి ఇరువైపులా దెబ్బతింటున్న గ్యాబిన్ బాక్స్ నిర్మాణం
- విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనచోదకుల ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కోడూరు: దివిసీమలోని తీరప్రాంత మండలాలను జిల్లా కేంద్రమైన మచిలీపట్నం దగ్గరగా కలిపే వారధి ఇది. అదే కృష్ణానదిపై నిర్మించిన 'ఉల్లిపాలెం- భవానీపురం' వారధి. ఈ వారధిపై అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

దెబ్బతింటున్న గ్యాబిన్ బాక్స్ నిర్మాణాలు..

ఉల్లిపాలెం కృష్ణా కరకట్ట నుంచి భవానీపురం కరకట్ట వరకు ఈ వారధిని నిర్మించారు. అయితే నది పైభాగంలో 525 మీటర్ల మేర మాత్రమే వారధి నిర్మాణం చేపట్టగా, వారధిని అనుసంధానం చేస్తూ ఇరువైపులా సుమారు కిలోమీటర్ మేర రహదారులను నిర్మించారు. విపత్తులు, వరదల సమయంలో కృష్ణానది నీరు ఇరువైపులా కరకట్టను తాకే అవకాశం ఉండడంతో రహదారుల పటిష్టత కోసం ఈ ప్రాంతంలో గ్యాబిన్ బాక్స్ నిర్మాణాలను చేపట్టారు. నేపాల్ నుంచి తీసుకువచ్చిన పీవీసీ కొట్టింగ్ కలిగిన జల్లెడ బాక్సుల్లో కొండరాళ్లను అమర్చి వారధి రహదారులను పటిష్టపర్చారు. సుమారు రూ.4 కోట్లతో ఈ పనులను చేపట్టారు. ప్రస్తుతం ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలు వచ్చాయి. గ్యాబిన్ బాక్స్‌ల మధ్యలో నుంచి చెట్లు పెరిగాయి. వీటి వల్ల గ్యాబిన్ బాక్స్ దెబ్బతింది.

సూసైడ్ స్పాట్‌గా..

కృష్ణానదిపై ఈ వారధిని నిర్మించారు. అయితే ఈ ప్రాంతంలో సముద్ర ఆటుపోట్ల కారణంగా ఎప్పుడూ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ఇక నది మధ్యభాగంలో లోతు కూడా ఎక్కువే. ఈ వారధి ప్రాంతాన్ని చాలా మంది సూసైడ్ స్పాట్‌గా ఎంచుకుంటున్నారు. వారధిపైకి ఎక్కి నదిలో దూకి ఏడాదిలో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.



చెట్లు పెరగడంతో దెబ్బతింటున్న, రాళ్ల కట్టడాలు

ఇలా చేస్తే సరి..

వారధి నిర్మించిన 525 మీటర్ల మేర ఇరువైపులా ఆరడుగుల ఎత్తున మెస్‌ను ఏర్పాటు చేస్తే నదిలోకి దూకే అవకాశం ఉండదు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంది.

విద్యుత్ దీపాలు లేక..

ఈ వారధిపై విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేయలేదు. వారధి సగభాగం ఉల్లిపాలెం పంచాయతీ పరిధిలోకి, మిగతా సగభాగం వాడపాలెం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వారధిపై మందుబాబుల హడావుడి ఎక్కువగా ఉంటోంది.

పట్టించుకోని పాలకులు..

వారధి రహదారి, గ్యాబిన్ బాక్స్ నిర్మాణాలు దెబ్బతింటున్నా అధికారులు పట్టించుకోవటంలేదు. పెరిగిన చెట్లను తొలగించే ప్రయత్నాలు చేయటం లేదు. పాలకులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



ఉల్లిపాలెం వారధి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. ఇరువైపులా రాళ్ల కట్టడాల మధ్యలో చెట్లు పెరగడంతో ఆ కట్టడాలు దెబ్బతింటున్నాయి. విద్యుత్‌దీపాలు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలి.

– అడుసుమిల్లి రాము, ఉల్లిపాలెం

అధికారులు పట్టించుకోవాలి



వారధి పరిస్థితులను అధికారులు పట్టించుకోవాలి. వారధికి ఇరువైపులా ముళ్లచెట్లు కూడా పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. వారధి మధ్య భాగంలో లోతు అధికంగా ఉండడంతో ప్రమాదాలు నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఫెన్సింగ్‌తో పాటు సీసీ కెమెరాలను వారధిపై ఏర్పాటు చేయాలి.

– అరజా నాగరాజు, ఉల్లిపాలెం

అవనిగడ్డ అభివృద్ధికి పర్చూరి కృషి



అవనిగడ్డ: మాజీ సర్పంచ్ పర్చూరి సోమేశ్వరరావు 25వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సంతమార్కెట్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు స్థూపం వద్ద నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ సోమేశ్వరరావు సర్పంచ్‌గా అందించిన సేవలను కొనియాడారు. అవనిగడ్డ పంచాయతీకి సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన అవనిగడ్డ అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డారని చెప్పారు. ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ప్రముఖ న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హనుమాల సురేంద్రనాథ్‌బెనర్జి, పువ్వాడ నాగేశ్వరరావు, అద్దాడ ప్రసాద్, సీపీఐ లిబరేషన్ నాయకుడు హరనాథ్, న్యాయవాది అందే శ్రీరామకృష్ణమూర్తి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

21న మండల సమావేశం

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో అరుణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులు, కోఆప్షన్ సభ్యులు తప్పకుండా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు పూర్తి సమాచారంతో రావాల్సిందిగా ఆమె తెలిపారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



నగరంలోని భాస్కరపురంలో జలమయమైన అంతర్గత రహదారి



బందరు ప్రధాన రహదారిపై దుకాణాల చుట్టూ చేరిన నీరు

మచిలీపట్నంటౌన్: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి 9.30 గంటల నుంచి తేలికపాటి జల్లులు కురిశాయి. ఆ తర్వాత దాదాపు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రహదారులు పూర్తిగా జలమయమై తటాకాలను తలపించాయి. రహదారులపై పెద్ద ఎత్తున నీరు చేరటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. నీటిలో వాహనాలు మొరాయించటంతో వారు పడ్డ కష్టాలు వర్ణనాతీతం. నగరంలోని ఏ రహదారి చూసినా వర్షపునీటితో నిండి కన్పించాయి. ఇక్కసారిగా భారీ వర్షం కురవటంతో డ్రెయిన్లు పొంగి పొర్లాయి. దీంతో రహదారులపై గంటల పాటు నీరు నిలిచిపోయాయి. మధ్యాహ్నానికి రహదారులపై నీరు తొలగటంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన రహదారి వెంబడి పండ్లు, కూరగాయలు విక్రయించే దుకాణాలు సైతం వర్షపు నీటిలో చిక్కుకున్నాయి. దుకాణాలు ముంపుబారిన పడి కొనుగోలుదారులు రాక వ్యాపారాలు లేక దుకాణదారులు నిరాశ చెందారు. వర్షపునీటిలో తేలియాడుతున్న దుకాణాల వద్దే కొనుగోలుదారుల కోసం ఎదురుచూశారు. గత కొద్ది రోజులుగా అధిక ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులు ఈ వర్షంతో వాతావరణం చల్లబడటంతో సేదదీరారు. రేపట్నుంచి మళ్లీ ఎండలు పెరుగుతాయేమోనని భయాందోళనలకు గురవుతున్నారు.

మోపిదేవి: వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆకాశం మేఘావృతం అయ్యింది. దీని ప్రభావంతో బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడి మండలంలో పలు చోట్ల వర్షాలు పడ్డాయి. ప్రకృతి కరుణించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొంత వర్షం పడితే వ్యవసాయ దుక్కులు ప్రారంభించేందుకు అనుకూలంగా ఉటుందని రైతులు అంటున్నారు.

కేంద్రం తీరుతో సంక్షోభంలో రవాణా రంగం

ఘంటసాల: కేంద్ర ప్రభుత్వ విధానాల వలన రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా అన్నారు. ఘంటసాల సెంటర్లో ఆటో యూనియన్ నాయకులతో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అండతో కార్పొరేట్ దిగ్గజాలు ట్రాన్స్‌పోర్టు రంగాన్ని కుదేలు చేసి వారి హస్తగతం చేసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జీవో నంబర్ 21 పేరుతో ఆటో, టాక్సీలు, లారీలపై భారాలు వేశారని, కార్మికులను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు గురించి పట్టించుకోవడం లేదన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రవాణా రంగానికి తోడు ముడి చమురు ధరలు తగ్గాల్సిందిపోయి విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కార్మికులు సాధించుకున్న 44 లేబర్ చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20న జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు వాకా రామచంద్రరావు, కౌలు రైతు సంఘం మండల నేత మేడంకి వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.



ఘంటసాల సెంటర్లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

కొడాలిలో ఇరువర్గాల ఘర్షణ

ఏడుగురిపై కేసు నమోదు

కొడాలి(ఘంటసాల): మండలంలోని కొడాలి గ్రామంలో ఇరు వర్గాలు ఘర్షణ పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొడాలి గ్రామానికి చెందిన చిట్టూరి పవన్ కుమార్ బైక్‌పై వాళ్ల బాబాయి ఇంటికి వెళ్తుండగా లంకా మున్నా రోడ్డుకు అడ్డంగా ఉండటంతో తప్పుకోమని పవన్ అన్నాడు. దీంతో మున్నా పవన్‌పై దాడి చేయగా గాయపడిన 108లో చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మున్నా మరి కొందరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు. మరో కేసులో మున్నా రోడ్డుపై ఉండగా పవన్ కుమార్ బైక్‌తో మున్నా మీదకు వెళ్లాడు. చూసుకుని వెళ్లాలని పవన్‌ను మున్నా అనడంతో పవన్ తనపై దాడి చేశారన్నారు. నొప్పులు భరించలేక ఆదివారం చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు పవన్ మరి కొందరిపై కేసు నమోదు చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరువర్గాలకు చెందిన ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వి.వెంకట్రావు తెలిపారు.



చలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిట్టూరి పవన్ కుమార్

లే అవుట్లను ఆక్రమించి మట్టిదందా



మట్టి గుట్టల వద్ద కొలతలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న అబ్దుల్‌ఖయ్యూం

- పేదల ఇళ్ల చుట్టూ అనధికారికంగా మట్టి గుట్టలు
- రెవెన్యూ అధికారుల రంగ ప్రవేశం

పెడన: పేదల ఇళ్ల స్థలాల సమీపంలో ప్రభుత్వ స్థలంలో మట్టి గుట్టలు వేయడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్నారని కాలనీ వాసులు అంటున్నారు.

విషయం ఇదీ..

పల్లోటి లే అవుట్ సమీపంలో ఇళ్లవద్ద ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఆ స్థలంలో అక్రమంగా మట్టి నిల్వలను ఉంచడమే కాకుండా కోర్టు కేసులో ఉన్న స్థలంలో కూడా మట్టి నిల్వలను వేసేసి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ రెవెన్యూ సిబ్బంది పేర్కొవడం విశేషం.

కాలనీ వాసుల ఫిర్యాదు..

నాలుగు రోజులుగా పల్లోటి లే అవుట్ వద్ద ఉన్న పేదల ఇళ్ల చుట్టూ మట్టి కుప్పలను వేసి అధికార పార్టీకి చెందిన ఒక వ్యక్తి కబ్జా చేశాడని, దీనిపై స్థానిక తహసీల్దార్ కే అనిల్ కుమార్‌కు ఫిర్యాదు చేశామని పల్లోటి పాఠశాల వెనకాల జగనన్న కాలనీ లబ్ధిదారులు వాపోతున్నారు. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు కట్టుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో నిర్మాణం చేపట్టాడానికి సిద్ధపడంగానే తమ స్థలాల చుట్టూ మట్టి కుప్పలను అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్‌ఖయ్యూం వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

కదిలిన యంత్రాంగం..

దీంతో ఆయన శనివారం ఉదయం మండల సర్వేయర్‌తో పాటు ఇన్‌చార్జి ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వో ఏసుపాదం తదితరులు లే అవుట్ వద్ద స్థలాలను పరిశీలించారు. మట్టి కుప్పలు వేసిన మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్‌ఖయ్యూంను కూడా ఆరా తీశారు. ఇది తన స్థలమేనని, అందుకే మట్టి కుప్పలు వేసుకున్నట్లు ఖయ్యూం అధికారులకు స్పష్టం చేశారు. డాక్యుమెంట్లు చూపించాలని రెవెన్యూ అధికారులు కోరారు. తన వద్ద డాక్యుమెంట్లు లేవని, పూర్వకాలం నాటి ఆస్తులేనని, కేవలం పట్టదారు పాస్‌పుస్తకాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కోర్టులో ఉన్న స్థలంలో కూడా మట్టి కుప్పలు తోలడం ఏమిటంటూ రెవెన్యూ అధికారులు ప్రశ్నించారు.

స్థలం అప్పగించాలంటున్నా..

గతంలో పేదల ఇళ్లకు స్థలాలను ఇచ్చానని, నాస్థలం నాకు కొలిచి ఇవ్వాలని రెవెన్యూ అధికారులను చాలా సార్లు కోరానని అబ్దుల్‌ఖయ్యూం తెలిపారు. అయినా వారు కొలతలు వేయలేదు. నా స్థలంలో మట్టి తోలుకుని మెరక చేసుకుంటానని అధికారులను కలిసి తెలియజేశా. వారు సరేనంటే మట్టి తోలుకున్నా.

మట్టి గుట్టలను తొలగించాం

పల్లోటి లే అవుట్ వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమించినట్లు గుర్తించాం. సర్వే, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైంది. ఎవరైతే ఆక్రమించుకున్నారో వారిని డాక్యుమెంట్లు తీసుకువచ్చి చూపించాలని కోరడం జరిగింది. విచారణ చేసి ఆదివారం మట్టి గుట్టలను తొలగించాం.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు, పెడన

కరెంట్ పోతే కష్టాలే

- నగరపాలక సంస్థ కార్యాలయంలో జనరేటర్‌కు ఆయిల్ నిల్
- ఏడాదిగా బంక్‌కు బిల్లు చెల్లించని వైనం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ కోత విధిస్తే అంధకారం అలముకుంటోంది. విద్యుత్ కోత సమయంలో వినియోగించేందుకు ఉన్న జనరేటర్ పని చేసేందుకు అవసరమైన డీజిల్ ఆయిల్ సరఫరా నిలిచిపోవటంతో సమస్య కొనసాగుతోంది. విద్యుత్ పోతే జనరేటర్ వేయకపోవటంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి పాలకుల పాలనలో కార్యాలయంలో ఈ దుస్థితి నెలకొంది. జనరేటర్‌కు వినియోగిచే డీజిల్ ఆయిల్ బకాయిలను బంక్ యాజమాన్యానికి నగరపాలక సంస్థ చెల్లించకపోవటంతో వారు డీజిల్‌ను పోసేందుకు నిరాకరిస్తున్నారు. దాదాప ఏడాది కాలంగా ఇదే పరిస్థితి ఇక్కడ నెలకొన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. బిల్లులు చెల్లించే సంబంధిత గుమాస్తా నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని ఉద్యోగులు వాపోతున్నారు. గత శనివారం ఉదయం విద్యుత్ సిబ్బంది మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలుపుచేశారు. దీంతో కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో కంప్యూటర్లు పనిచేయక, ఫ్యాన్‌లు తిరగక, వెలుతురు లేక ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. సిబ్బందే వెయ్యి రూపాయల ఆయిల్ తీసికొచ్చి జనరేటర్‌లో పోసి, విద్యుత్ సరఫరా పునరుద్ధించుకుని ఊపిరి పీల్చుకున్నారు. అసలే అధిక ఎండలు కాస్తుండటంతో పాటు ఉక్కపోతతో సిబ్బంది శనివారం విద్యుత్ కోత సమయంలో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కొండలమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో అమ్మవారి దర్శనానికి భక్తులు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. ఆదివారం భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో చెల్లించుకునేందుకు బారులు తీరారు. దీంతో ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. పాల పొంగళ్లు పొంగించి, భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న జడ్జి..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెను వేద పండితులు దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. తొలుత జడ్జి పేరిట అమ్మవారికి వేద పండితుడు రుద్రపాక శరశ్చంద్ర సంతోష్ ప్రత్యేక పూజలు చేశారు.



జడ్జి గాయత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

వైభవంగా అంకమ్మతల్లి సంబరాలు

తోట్లవల్లూరు: గరికపర్రులో వీరంకి వారి అంకమ్మతల్లి సంబరాలు వైభవంగా ముగిశాయి. మొదటి రోజైన శనివారం గ్రామంలో పోతురాజు గెడను ఊరేగించగా, రెండో రోజైన ఆదివారం అమ్మవారికి మొక్కుబడుల చెల్లింపుతో సంబరాలు ముగిశాయి. తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి వీరంకి వంశీకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంకమతల్లిని దర్శించుకోవటంతో పాటు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి వెంకటేష్ గౌడ్, కమిటీ సభ్యులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.